

వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక

కోచ్‌గా వైకుంఠరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ లో జరగనున్న ఆలిండియా ట్రైబల్ వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టుకు విజయనగరం జిల్లా నుండి నలుగురు క్రీడా కారులు ఎంపికయ్యారు. వీరిలో కురుపాం మండలం పొడిగూడ గ్రామానికి చెందిన పి.రాజశేఖర్, ఎ.మంగరాజు, గుమ్మలక్ష్మీపురం మండలం మేదరగండకు చెందిన ఎ.దిలీప్, పి.మల్లేష్ ఉన్నారు. రాష్ట్ర జట్టుకు చీఫ్ కోచ్‌గా గుమ్మలక్ష్మీపురం ఫిజికల్ డైరెక్టర్ బి.వైకుంఠరావు నియమితులయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు గవర సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి టివి భగ వాన్ దాస్, జిల్లా కార్యదర్శి కెవిఎన్ రాజు అభినందించారు.

చెత్త వాహనాలకు చెల్లింపుల భారం

- ప్రయివేటు ఏజెన్సీకి చెల్లించేందుకు సరిపోని పన్నుల సొమ్ము
- జనరల్ ఫండ్ నుంచి కూడా చెల్లిస్తున్న పరిస్థితి
- ఆస్తిపన్నులో కొత్తగా చెత్త పన్ను పేరుతో అదనపు వడ్డింపు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్ కార్యక్రమం)లో భాగంగా రాష్ట్రప్రభుత్వం పురపాలక సంఘాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణే లక్ష్యంగా ఏర్పాటుచేసిన వాహనాల నిర్వహణ మున్సిపాలిటీలకు తలకు మించిన భారంగా మారింది. ప్రజల నుంచి వసూలు చేసిన యూజర్ ఛార్జీల మొత్తాన్నీ ఈ వాహనాలకే చెల్లిస్తున్నారు. అందరూ చెత్తపన్ను చెల్లిం చలేక పోవడంతో యూజర్ ఛార్జీలు చాలక కొన్ని మున్సిపాలిటీలు జనరల్ ఫండ్ నుంచి ప్రైవేటు ఏజెన్సీకి చెల్లిస్తున్న పరిస్థితి ఉంది.

విజయనగరం నగరపాలక సంస్థ నుంచి ప్రతినెలా ఒక్కొక్క వాహనానికి రూ.63 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ప్రస్తుతం 53 క్లాప్ వాహనాలకు ప్రతి నెలా 33.21 లక్షలు చొప్పున గత రెండేళ్లుగా చెల్లిస్తున్నారు. తొలుత 61 వాహనాలు ఉండగా వాటిని 53 వాహనాలకు కుదించారు. కేంద్రం నుంచి వస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు నేరుగా పురపాలక, నగరపాలక సంస్థలకు ఇచ్చినట్లయితే ఆ వాహనాలు నేరుగా కొనుక్కోవడం జరిగేది. అయితే చెత్త సేకరణ వాహనాల కొనుగోలు అంశం పురపాలక సంఘాలకు ఇవ్వకుండా రాష్ట్రప్రభుత్వమే వీటిని కొనుగోలు చేసి పుర పాలక సంఘాలకు పంపింది. వీటి నిర్వహణ ను ప్రైవేట్ ఏజన్సీకి అప్పజెప్పి డ్రైవర్లను నియమించి ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేసి నెలవారీ చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో స్థానిక పురపాలక శాఖ అధికారులు శానిటేషన్ సెక్రటరీలు, వాలంటీర్ల ద్వారా చెత్త పన్ను వసూళ్లకు పూనుకున్నారు.

ఇలా ప్రతి నెలా లక్షల రూపాయల మేర యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం ఈ పాస్ మిషన్లు కూడా పురపాలక సంఘాలకు ఇచ్చి వాటికి కూడా ప్రతి నెలా అద్దె వసూలు చేస్తున్నారు. ఇప్పుడు పురపాలక, నగరపాలక సంస్థలు ప్రతి నెలా ప్రైవేట్ ఏజన్సీకి ఇస్తున్న సొమ్ముతో సదరు క్లాప్ ఆటోలను సొంతంగా కొనుగోలు చేయొచ్చు. ఒక్కొక్క వాహనం రూ. 7 లక్షలు ఖరీదు అనుకున్నా నగర పాలక సంస్థ ప్రతి నెలా చెల్లిస్తున్న సుమారు రూ.33 లక్షలతో కనీసంగా 5 వాహనాలు సొంతంగా సమకూరేవి. కార్పొరేషన్ ఆ సొమ్ముతో ప్రతి నెల ఒక క్లాప్ వాహనం కొనుగోలు చేసే వీలుండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రతి నెలా ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేసి ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రతి నెలా ప్రైవేట్ ఏజన్సీకి చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఒక నెల ఏజెన్సీకి బిల్లు చెల్లించకపోతే సిఎంఒ నుంచి ఫోన్ వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా పట్టణాల్లో యూజర్ ఛార్జీలు వసూలు కాకపోయినా సరే జనరల్ ఫండ్ నుంచి సదరు మొత్తాలను చెల్లిస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన నిధులు క్లాప్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించాల్సి వస్తుంది.

యూజర్ ఛార్జీలు సక్రమంగా వసూలు కాకపోవడంతో చెత్త పన్నును కూడా ఆస్తిపన్నుతో పాటు అదనంగా వడ్డించే పనులకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో ఉన్న గృహాలు, వ్యాపార సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలను రీసర్వేలో భాగంగా గుర్తిస్తున్నారు. అసెస్మెంట్ల వారీగా వాటిని విభజించి ఆస్తిపన్నుల క్రమబద్ధీకరణలో భాగంగా పన్నులు వేస్తున్నారు. వీటితో పాటు నివాసాలు, వ్యాపార సంస్థలకు ప్రతి ఆరు నెలలకు ఇచ్చే ఆస్తిపన్నుతో పాటు చెత్త పన్ను కూడా కలిపి రశీదులు ఇవ్వనున్నారు.

వైద్యకళాశాలల్లో ఆధునిక సదుపాయాలు

వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ● వైద్యకళాశాల నిర్మాణ పనులు పరిశీలన

వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల్లో అన్ని రకాల ఆధునిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు చెప్పారు. తొలివిడతగా నిర్మిస్తున్న విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను వచ్చే విద్యాసంవత్సరంనుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఎపిఎంఎస్ఐడిసి ఎండి మురళీధరరెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులతో కలిసి, విజయనగరం గాజులరేగ వద్ద నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ, తొలివిడత ఐదు కళాశాలలను వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రాపారంభిస్తున్నామని చెప్పారు. కళాశాలను ప్రారంభించే నాటికి అన్ని వసతులను పూర్తిగా కల్పించాలని ఆదేశించారు. తరగతి గదుల్లో స్మార్ట్ టీచింగ్ విధానాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, రెండు చోట్ల నుంచి విద్యుత్‌ను తీసుకోవాలని సూచించారు. నీటి వసతి కోసం రూ.10కోట్లతో ప్రతిపాదించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. బోధనకు అవసరమైన అన్ని రకాల పరికరాలు, ఫర్నీచర్, ఇతర సామగ్రి అంతా ప్రారంభం నాటికే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న అత్యుత్తమ బోధనా పద్ధతులను ఈ కళాశాలలో ఏర్పాటు చేయాలని, దీనికోసం నిపుణుల బృందం ఇతర వైద్య కళాశాలలను సందర్శించి నివేదిక తయారు చేయాలని సూచించారు. అన్ని సదుపాయాలతో హాస్టల్ భవనాన్ని నిర్మించి, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆయన వెంట డిఎంఇ వరప్రసాద్, ఎపిఎంఎస్ఐడిసి ఎస్ఇ అంకమ్మ చౌదరి, ఇఇ బిఎన్ ప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటిండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'రియల్' వ్యాపారి బరితెగింపు

పంటకాలువకు అడ్డంగా గోడ నిర్మాణం ● అడ్డుకున్న డెంకాడ, పినతాడివాడ రైతులు

ప్రజాశక్తి-డెంకాడ

ఎవరెలా పోతే నాకేంటి? నా పని అవుతుందా? లేదా? అన్నట్లు వ్యవహరించాడో రియల్ ఎస్టేట్ వ్యాపారి. తన పని కోసం అడ్డదారులు తొక్కడైనా సిద్ధమయ్యాడు. చివరికి బరితెగించి మరీ పంటకాలువకు అడ్డంగా గోడ నిర్మాణానికి సిద్ధమయ్యాడు. రైతులకు సాగునీరు అందనివ్వకుండా చేయాలని చూశాడు. రైతులు ప్రతిఘటించి, పనులను అడ్డుకోవడంతో కథ కాస్తా అడ్డం తిరిగింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

ప్రహరీ నిర్మాణానికి పంటకాలువకు అడ్డంగా తవ్వేసిన గొయ్యి

డెంకాడ మండలంలోని గుణుపూర్ రెవెన్యూ పరిధిలో సుమారు 100 ఎకరాల వరకు రియల్ ఎస్టేట్ లేఅవుట్ వేయడానికి పనులు మొదలుపెట్టారు. లేఅవుట్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నారు. ఆ పక్కనుంచి పెద్ద పంట కాలువ ఉంది. దాని ద్వారా రెవెన్యూ పరిధిలో ఉన్న చెరువులు.. ఎరకచెరువు, నీలాపు బందకు నీరు వెళ్తుంది. ఆ నీటిని వెళ్లకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారి.. కాలువకు అడ్డంగా పెద్ద గుంత నిర్మించి, నీటిని వేరేచోటకు తరలించేందుకు ప్రయత్నించాడు. ఈ నిర్మాణం చేపడితే పినతాడివాడ గ్రామానికి చెందిన శ్మశానవాటికతోపాటు జగనన్న కాలనీ ముంపునకు గురవుతుంది. కాలువ కిందన చెరువులకు నీరందే అవకాశం లేదు. ఈ విషయం తెలుసుకున్న పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, పినతాడివాడ, డెంకాడ సర్పంచులు లంక లక్ష్మణరావు, పతివాడ గౌరి, ఎంపిటిసి విజినిగిరి అచ్చెన్నాయుడు ఆధ్వర్యాన రైతులు అక్కడికి చేరుకుని, ఆ పనులను అడ్డుకున్నారు. కనీసం రెండు పంచాయతీల తీర్మానాలు తీసుకోకుండా, రైతులను, పెద్దలను సంప్రదించకుండా రియల్ ఎస్టేట్ యాజమాన్యం బరితెగించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటకాలువకు అడ్డంగా గోడ నిర్మించడం ఏమిటని నిలదీశారు. కాలువలో అక్రమంగా గోడ కడుతున్న రియల్ ఎస్టేట్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం రెండు గ్రామాల నాయకులు, రైతులు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును విజయనగరంలో కలిసి, సమస్యను వివరించారు. వెంటనే ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారిని పిలిపించారు. కాలువను యథాతథంగా ఉంచాలని, గోడ నిర్మించవద్దని జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నాడు - నేడు పనుల్లో వేగం పెంచాలి ● డివిజన్ స్థాయి సమీక్షలో కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-చీపురుపల్లి

జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. చీపురుపల్లి డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో నిర్దేశిత లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో నాడు - నేడు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులపై శుక్రవారం చీపురుపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

మండలాల వారీగా అధికారులను, సచివాలయం ఇంజిరింగ్ అసిస్టెంట్లను అక్కడ సాధించిన ప్రగతి గురించి ఆరా తీశారు. ఇటీవల వచ్చిన కొత్త డి.పి.ఆర్.కు అనుగుణంగా పని చేయాలని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. రాజాం నియోజకవర్గ పరిధిలో 85 శాతం లక్ష్యాలను మాత్రమే చేరుకున్నారని.. ఇది సరిపోదని శత శాతం చేరుకోవాలని నిర్దేశించారు. 15 రోజులకు ఒక సారి నూతన లక్ష్యాలు వస్తాయని వాటికి అనుగుణంగా అందరూ పని చేయాలని సూచించారు. నాడు - నేడు మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని, పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 390 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ కిట్ ఏర్పాటు చేయాల్సి ఉంది కాబట్టి సంబంధిత పనులను ముందుగా చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ విభాగం పరిధిలో చేయాల్సిన పనులను త్వరితగతిన ముగించాలని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సరిగ్గా నిర్వహించాలని సూచించారు.

నాడు-నేడు ఉపకరణాలను స్థానికంగా కొనుగోలు చేసుకోండి

విజయనగరం: పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు-నేడు పనుల్లో భాగంగా అవసరమైన విద్యుత్, మరుగుదొడ్లు, టైల్స్ ఉపకరణాలను స్థానికంగా కొనుగోలు చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇండెంట్ పెట్టుకొని నిబంధనలు ప్రకారం వస్తువులను కొనుగోలు చేసుకొని పనులను వేగంగా ముగించాలని చెప్పారు. వీటికి సంబంధించి ఆర్థిక వనరులను ముందుగానే చెల్లించ నున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో చీపురుపల్లి ఆర్డీవో అప్పారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణ మూర్తి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, అన్ని మండలాల ఎంపిడిఒలు, గృహ నిర్మాణ, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దశ మారకుంటే చర్యలు

ప్రభుత్వ ప్రయారిటీ భవనాలైన సచివాలయాలు, ఆర్.బి.కే లు, హెల్త్ క్లినిక్స్ ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. చిన్న చిన్న పనులు పెండింగ్ ఉన్న భవనాలను 15 రోజులలో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియం లో శుక్రవారం ప్రయారిటీ భవనాల పురోగతిపై ఎంపిడిఒలు ఇంజినీరింగ్ అధికారులతో మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఆన్‌లైన్‌లో పూర్తైనట్లు చూపించారంటే వినియోగానికి సిద్ధంగా ఉన్నట్లు భావించాలని అన్నారు. పూర్తి కాకుండా పూర్తి చేసినట్లు అప్‌లోడ్ చేయవద్దని అన్నారు. వచ్చే 15 రోజుల్లో ప్రతి పని స్టేజి మారాలని వర్క్ వారీగా భవనం వారీగా అడుగుతానని, స్టేజి మారక పోతే చర్యలు తప్పవని అన్నారు. ఈ ఏడాది విత్తనాలు, ఎరువులు 50 శాతం వరకు ఆర్‌బికెల ద్వారానే సరఫరా జరుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్‌బికె భవనాలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలన్నారు. అదే విధంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అందుబాటు లోకి వచ్చినందున హెల్త్ క్లినిక్స్ భవనాలను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప్ లో భాగంగా ఘన వ్యర్థ నిర్వహణా షెడ్లను పూర్తి చేసి వర్మి కంపోస్ట్ లను చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, ఆర్‌డబ్లుఎస్, పంచాయతీరాజ్ ఎస్ఇలు ఉమా శంకర్, గుప్తా, డిపిఒ శ్రీధర్ రాజా పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి

దశల వారీ ఉద్యమం

ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్యమం చేపడతామని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు, సెక్రటరీ జనరల్ సిహెచ్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం జిల్లాపరిషత్ మినిస్టీరియల్ హాలులో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. పరిశీలకులుగా రాష్ట్రనాయకులు ఎజిఎస్ గణపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 8 డిమాండ్లతో రాష్ట్ర ఫ్యాప్టో దశల వారి పోరాటానికి పిలుపునిచ్చిందని, వీటి సాధనకు విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరి పైన ఉందని అన్నారు. జీవో నెంబర్ 117 ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కోరారు. అనంతరం డిఆర్ఒ గణపతిరావుకు వినతి అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మార్చుకోవాలని, జి.ఓ.నెం. 117ను రద్దు చేయాలని, బోధనేతర పనులు రద్దు చేయాలని, రెగ్యులర్ ప్రమోషన్లు ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని చట్టబద్ధమైన 12వ పి.ఆర్.సి కమిటీని నియమించాలని, . కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.ఈశ్వరరావు, వై.అప్పారావు, జె.వి.ఆర్.కె.ఈశ్వరరావు, రమేష్ చంద్ర పట్నాయక్, రమణ, బుకారిబాబు, శ్రీరామ్మూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే వేసవి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మే 1 నుంచి 31వరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన జరిగిన కరాటే వేసవి శిక్షణ ముగిసింది. ఈ శిక్షణా శిబిరంలో సుమారుగా 40 మంది విద్యార్థులు కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరినీ కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ సాయిదేవమణి అభినందించారు.

గ్రీన్ ఎనర్జీ వైపు అడుగేద్దాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విద్యుత్తు వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత గ్రీన్ ఎనర్జీవైపు అడుగులు వేయాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అందరితోను ప్రతిజ్ఞ చేయించారు. గో ఎలక్ట్రిక్..... గో గ్రీన్ నినాదంతో జిల్లా పరిషత్ ఆవరణలో నెడ్‌క్యాప్ ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ప్రదర్శన, అవగాహనా కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, ఆటోలను, కార్లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. వాహనాలను స్వయంగా నడిపి చూశారు. ఈ ప్రదర్శన గురించి, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాల్సిన ఆవశ్యకతను, నెడ్‌క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎం.వి.కె.రాజు వివరించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరూ తప్పనిసరిగా విద్యుత్ వాహనాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోలు, డీజిల్ లాంటి సాంప్రదాయ ఇంధనాలవల్ల కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోందని, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని చెప్పారు. ఈనేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే, ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనికోసం జిల్లా పరిషత్ ఆవరణలో ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

నెడ్‌క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎం.వి.కె.రాజు మాట్లాడుతూ, కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పించడం జరుగుతోందని అన్నారు. మన రాష్ట్రంలో సుమారు కోటి,30 లక్షల వాహనాలు ఉన్నాయని, వీటిలో అత్యధికంగా ద్విచక్రవాహనలేనని చెప్పారు. వీటి వినియోగం వల్ల లక్షల టన్నుల బొగ్గుపులుసు వాయువు వాతావరణంలో కలిసి, పర్యావరణం దెబ్బతింటోందని అన్నారు. విద్యుత్ వాడకాల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడమే కాకుండా, రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, జెడ్‌పిటిసి గార తవుడు, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, జెడ్‌పి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

12న డిఇఇ సెట్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

డైట్ కాలేజీల్లో ప్రవేశాలకోసం ఈ నెల 12న జరిగే డిఇఇ సెట్‌కు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. డిఇఇ సెట్ నిర్వహణ పై తన ఛాంబర్ లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష సోమవారం ఉదయం 10 నుంచి 12.30 గంటల మధ్య, స్థానిక అయాన్ డిజిటల్ సెంటర్‌లో జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో సుమారు 175 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

విద్యార్థుల కోసం తాగునీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి చేరుకొనేందుకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లక్ష్మీకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, పోలీసు, ఆర్‌టిసి, ఎపిఇపిడిసిఎల్, వైద్యారోగ్యశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర 6వ యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బుగత చంద్రశేఖర్(చంటి), పి.దేవకుమార్‌లకు శ్రీకాకుళం,పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు జిల్లాల వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్ ఛార్జ్ అవనాపు విక్రమ్ పూర్తి స్థాయి బాక్సింగ్ కిట్లను బహుకరించారు. ఇటీవల విశాఖ రైల్వేస్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ చాంఫియన్ షిప్ డిఆర్ఎం కప్ పోటీల్లో చంద్రశేఖర్ హెవీ వెయిట్ (86-92)పోటీల్లో ప్రత్యర్థులను నాకౌట్ చేసి, బంగారు పతకాన్ని సాధించాడు. రాష్ట్ర స్థాయిలో రాణించిన చంద్రశేఖర్(చంటి) సిక్కిం రాష్టంలో, గాంగ్ టాక్ జిల్లాలో ఈనెల 13 నుండి 19 వరకు జరగబోయే నేషనల్ యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో ఆంధ్రప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 80-86 కిలోల కేటగిరిలో పి. దేవకుమార్ కూడా రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పోటీపడుతున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో వీరిద్దరూ రాణించి , విజయనగరం జిల్లా ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేయాలని ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముని లక్ష్మణరావు, సంపత్‌రాజు, ఎన్నింటి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్సు పరిశీలన

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను, డిపోను శుక్రవారం జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని విధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్ లు జోనల్ చైర్మన్ దృష్టికి సెలవులు, బదిలీలపై విన్నవించారు. వెంటనే ఆమె స్పందించి డిపో మేనేజర్ జె.శ్రీనివాస్‌ను పిలిచి వారి సమస్యలు ను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం డిస్పెన్సరీని సందర్శించి సిబ్బందికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్గో సేవలు విభాగాన్ని సందర్శించి కార్గో మేనేజర్ కె. దివ్యతో మాట్లాడారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ పి. భానుమూర్తి, సంఘ ప్రతినిధులు రవికాంత్, శ్రీను కలిసి జోనల్ చైర్మన్‌కు పలు సమస్యలపై వినతి అందజేశారు.

ఆర్‌టిసి కాంప్లెక్సును పరిశీలిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ

ప్రజాశక్తి
www.prajasakti.com

నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెసిఎస్ పట్టణ, మండల కన్వీనర్లు ఆర్.విస్సు, ఆర్.దామోదరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో బొబ్బిలి మున్సిపాలిటీ, మండలం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థతో అవినీతి రహిత పాలన సాగుతోందని తెలిపారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి, కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కోరారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను శుక్రవారం జనసైనికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సరిపడా ఫ్యాన్లు లేవన్నారు. నాలుగు ఫ్యాన్లు ఉన్నా పని చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని చెప్పారు. ఆర్‌టిసి యాజమాన్యం నిర్మించిన పబ్లిక్ మరుగుదొడ్లు వినియోగించకుండా, ప్రయివేట్ యాజమాన్యం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు డబ్బులు చెల్లించి ఉపయోగించాలని చెప్పడం అన్యాయమన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ షాపుల నుంచి నెలకు రూ.5 లక్షల వరకు అద్దెలు వస్తున్న ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, బి.గణేష్, కిరణ్, బి.దివ్య, జనసైనికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్‌అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-బాడంగి

జీతాలు అందించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సురేష్ మాట్లాడుతూ ఆర్నెల్లుగా వేతనాలు అందించడం లేదని, దీనివల్ల కార్మికుల కుటుంబాలకు పూటగడవడం కష్టంగా మారిందని తెలిపారు. కనీస వేతనం రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు.

పనులు వేగవంతం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అధికారులను ఆదేశించారు. మండలంలోని చొల్లంగిపేటలో సచివాలయ, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్, పాఠశాలలో నాడు-నేడు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. డెంకాడలో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా చేపడుతున్న కాలువ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు అభినందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన బుద్ధ సత్యం కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో విశాఖపట్నంలోని షీలానగర్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైఎస్ఆర్ బీమా రెన్యువల్ కోసం వేలిముద్రలను సేకరించేందుకు వాలంటీర్ శివ సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లారు. సత్యం బయోమెట్రిక్ పూర్తిచేసి, బీమా రెన్యువల్ చేశారు. వాలంటీర్ సేవలను గ్రామ నాయకులు అప్పలనాయుడు, గ్రామస్తులు అభినందించారు.

11న ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఎపి ఆదర్శ పాఠశాలలో 2023-24 సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు ముందుగా దరఖాస్తులు చేసుకున్న వారు apms.apcfss.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడ శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులు మహంతి శ్రీనివాసరావు విద్యార్థులకు తెలుగు వ్యాకరణం చెప్పారు. తెలుగు వ్యాకరణం బాగా నేర్చుకుంటే మంచి మార్కులు సాధిస్తారని లైబ్రేరియన్ వై.మహేశ్ చెప్పారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ మైపాడ ప్రసాద్

కౌన్సిలర్ చొరవతో శ్మశానం రహదారి అభివృద్ధి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీ శ్మశానవాటిక రహదారి అభివృద్ధి పనులను కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ చేపట్టారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో 7, 8, 9, 10 వార్డులకు చెందిన శ్మశానానికి సరైన రహదారి లేక మృతదేహాలను తీసుకెళ్లే వారు ఇబ్బందులు పడేవారు. దీంతో ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ సొంత నిధులు రూ.30 వేలతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయా వార్డుల ప్రజలు ఆయనను అభినందించారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మజ్జి శ్యామసుందర్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. శుక్రవారం ఇందిరమ్మకాలనీ, పొలవానివలస పేదలకు ఆహార పొట్లాలను నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఎల్.వాసుదేవరావు పంపిణీ చేశారు.

మొక్కలు కనబడలేదు

సామాజిక ప్రజావేదికలో తనిఖీ బృందాలు వెల్లడి

ప్రజాశక్తి-వంగర

ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, చెరువుగట్టుపైన గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేసిన మొక్కలు ఏ గ్రామాల్లో చూసినా కనబడటం లేదనిసామాజిక తనిఖీ బృందాలు వెల్లడించాయి. మే 26 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు మండలంలో వివిధ గ్రామాలలో సామాజిక తనిఖీ బృందాలు గ్రామీణ ఉపాధి పనుల పై తనిఖీ నిర్వహించి శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా గుర్తించిన అంశాలను వివరించారు. ఎం.సీతారాంపురం, మగ్గూరు, కొప్పర, కొండచాకరాపల్లి, భాగంపేట తదితర గ్రామాలలో వేసిన మొక్కలు అంతంత మాత్రమే కనబడుతున్నాయి తప్ప మిగిలిన మొక్కలన్నీ కనబడ లేదని తెలిపారు. కొట్టిశ లో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని తమకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆ గ్రామస్తులు కోరినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పలు గ్రామాల్లో రికార్డులు సక్రమంగా లేనట్లు కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించాయి. మండల కేంద్రంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదికకు మండలంలో ఏ గ్రామం నుంచి కూడా ప్రజలు ఎవరూ కూడా రాకపోవడంతో గ్రామాల్లో సామాజిక బందాలు తనిఖీలు తూతూ మంత్రంగానే జరిపినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజావేదికలో నివేదికలను వివరిస్తున్న తనిఖీ బృందం సభ్యుడు

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించండి : ఎమ్మెల్యే

ఉపాధి పని జరిగే ప్రదేశంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సామాజిక ప్రజావేదిక లో ఆయన మాట్లాడారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎపిడి శారద, ఎపిఒ వెంకట నాయుడు, ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ , వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పిలు, డిఆర్‌పిఇలు, ఉపాధి హామీసిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకు ధనార్జనే లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదలకు భారంగా, ధనార్జనే ధ్యేయంగా రైల్వే పనిచేస్తోందని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక లోక్‌సత్తా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం తరువాత మన రైల్వే వ్యవస్థపై సమీక్ష చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశా దుర్ఘటన తరువాత వేగవంతమైన రైళ్లను నడపడానికి భారత్ సిద్ధంగా ఉందా? అనే సందేహం ముందుకొచ్చిందన్నారు. మరోవైపు కరోనా తర్వాత ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి వాటినే ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి అన్ని స్టేషన్లలో ఆపుతూ అధికంగా ఛార్జీలను వసూలు చేస్తున్నారని తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు ఇచ్చే రాయితీలను ఎత్తివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మెయిల్, ఎక్స్‌ప్రెస్‌లలో కూడా జనరల్ బోగీలు రెండే ఉంటున్నాయని, కొన్నింటిలో ఒకటి మాత్రమే ఉంచారని చెప్పారు. స్లీపర్ కోచ్‌లు తగ్గించి, ఎసి బోగీలను పెంచారని, సామాన్యులు ఎలా ప్రయాణిస్తారని నిలదీశారు. రైల్వేలో ఖాళీ పోస్టులు ఏళ్ల తరబడి భర్తీచేయడం లేదని, దీనివల్ల ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోందని తెలిపారు. వెంటనే రైల్వేలో ఉన్న సమస్యల పరిష్కారంపై కేంద్రం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

పేదల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేలు బడ్డుకొండ, కడుబండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-భోగాపురం

పేదప్రజల అభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలో చేపల కంచేరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నాలుగేళ్ల లో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న ఇల్లు మంజూరు కాలేదని పలువురు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, సచివాలయాల కన్వీనర్ ఎర్రప్పల నారాయణ, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దల్లి శ్రీనివాసరావు, కర్రోతు శ్రీను, పడాల భాను ప్రకాష్, ఎల్లారావు, పోతిరెడ్డి గోపి, సర్పంచ్ నరసింహులు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ బంగారయ్య పాల్గొన్నారు.

డబ్బిరాజుపేటలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని డబ్బిరాజుపేట గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు అందుతున్నదీ, లేనిది ఆరాతీశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొప్పలవెమల కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిసిసిబి చైర్మన్ వివి రామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

పోస్టు కార్డు ఉద్యమం చేస్తున్న పింఛనుదారులు

కనీస పింఛను రూ.9 వేలివ్వాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులకు కనీస పింఛను రూ.9 వేలకు పెంచాలని ఇపిఎస్ పింఛనుదార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయుద పాపారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద రిటైర్డ్ కార్మికులు పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కనీస పింఛను రూ.9 వేలకు పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం రామారావు, పాపారావు మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులతో సంతకాలు సేకరించి, ప్రధానమంత్రికి పంపుతామని చెప్పారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు ఓట్ల కోసం రూ.3 వేలు, 4 వేలకు పింఛన్లు పెంచుతుంటే, కార్మికులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ వరకు శ్రమించి పనిచేస్తే పింఛను కేవలం రూ.వెయ్యి ఇవ్వడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలతో చూస్తే రూ.వెయ్యి ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు కార్మికుల సొమ్ము ఉందని, ఆ ధనాన్ని కేంద్ర ప్రభుత్వం వాడుకొని కార్మికులను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికులు నందం సత్యనారాయణ, కొండేటి రాంబాబు, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు

డెంకాడ.. మాట్లాడుతున్న ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లిలో రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ తాళ్లపూడి కృష్ణ మాట్లాడుతూ రాయితీపై వరి విత్తనాలు సరఫరా చేయడానికి రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులు కూడా ముందస్తుగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భూసారం పెంచుకోవడానికి గాను పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి పివి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఖరీఫ్‌కి విత్తనాలు గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ అవసరమని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. సమావేశంలో సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపిటిసిలు బండారు శ్రీనివాసరావు, బండారు బంగారం, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరాడ సత్యనారాయణ, సుంకరి శ్రీనివాసరావు, లెంక అప్పారావు, ఎఇఒ సంతోష్, ఎంపిఇఒ చలుమూరి బిందు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ పతివాడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణరావు మాట్లాడుతూ వరి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎఒ పూడి నిర్మల మాట్లాడుతూ ఖరీఫ్ సన్నద్ధతపై వివరించారు. సమావేశంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్ము నాయుడు, తహశీల్దార్ ఆదిలక్ష్మి, పశువైద్యులు సాగర్, మర్రాపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంట్యాడ : వరి విత్తనాలు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో నిలువ ఉండేలా చూడాలని ఎంపిపి హైమావతి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధి రామునాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువులను రైతులకు సకాలంలో అందజేయాలని ఎంపిపి సూచించారు. కొత్త వరి వంగడాలను రైతులకు అందించాలని జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఇప్పలవలస గ్రామస్తులు

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై స్పందించరేం?

అధికారుల తీరుపై ఉపాధి కూలీల ఆగ్రహం

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని చింతాడవలస ఫీల్డ్‌అసిస్టెంట్ గేదెల రామునాయుడుపై విచారణకు అధికారులు మీనమేషాలు లెక్కించడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌ను ఇప్పలవలస గ్రామస్తులు కలిసి మరోసారి ఫిర్యాదు అందజేశారు. సుమారు రూ.30 లక్షల వరకు అవినీతికి పాల్పడ్డారని, చనిపోయిన వారికి పేరున పని కల్పించి స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, పీడీలకు ఫిర్యాదు చేశామని, కనీసం విచారణ జరపలేదని వాపోయారు. వలసపోయిన వారిపేరుతో మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంటు రామునాయుడు చివరికి చనిపోయిన వారిని కూడా వదిలిపెట్టలేదని తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్ అక్రమాల బాగోతం మొత్తం రూ. 30 లక్షల పైనే ఉంటుందని వివరించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోకుంటే, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు స్పష్టంచేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రొంగలి చంద్రశేఖర్‌రావు తెలిపారు. పాఠశాల మైదానం లోతుగా ఉండడంతో వర్షం పడితే నీరు నిల్వ ఉండిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చంద్రశేఖర్‌రావు సొంత నిధులతో మైదానంలో గ్రావెల్ వేసి చదును చేయించారు. ఈ పాఠశాల నిర్మించడానికి కూడా స్థలం ఉచితంగా రొంగలి సత్యవతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తన తండ్రి, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం అందించారని గుర్తుచేశారు.

మైదానం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రొంగలి చంద్రశేఖర్‌రావు

పార్కులో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

యుద్ధ స్తంభం వద్ద ఉన్న పార్కు వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అధికారులను డిమాండ్ చేశారు. పార్కును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ స్తంభం వద్ద ఉన్న పార్కులో మౌలిక సౌకర్యాలు లేక సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పార్కు వద్ద ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

అమ్మో పులి

ఆవుపై దాడి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి సమీపంలో బాగువలస రూటులో ఉన్న ఆర్.రాంప్రసాద్ అనే రైతు పామాయిల్ తోటలో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. దీంతో గుమడాం పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి పామాయిల్ తోటలో ప్రవేశించి దాడి చేసి ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయాన్నే తోటలో చూసే సరికి ఆవు చనిపోయి వుండడం, పులి అడుగు జాడలు కనిపించడంతో రైతు రాం ప్రసాద్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీ రేంజ్ అధికారి కె.రామారావు తోటలో ఆవుపై దాడి చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఒంటరిగా తిరగొద్దని, రాత్రి వేళల్లో పశువుల పాక వద్ద పడుకోవద్దని సూచించారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఈ ప్రాంతంలో తిరగాలని కోరారు. అటవీ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పట్టణానికి సమీపంలో ఉన్న తోటలో పులి సంచారం కనిపించడంతో పట్టణ వాసుల ఆందోళన చెందుతున్నారు.

పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని పటువర్ధనం గ్రామంలో చుక్కల చిన్నప్పమ్మ ఇంట్లో ఈ నెల 6న బంగారం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన హిమంది లక్ష్మణరావు, చుక్కల శివరావును అనుమానితులుగా గుర్తించి విచారించగా, వారిద్దరే నిందితులని రుజువైంది. వారిని మండలంలోని మడ్డువలస సమీపంలో అదుపులోకి తీసుకొన్నారు. దొంగలించిన పుస్తెలతాడు, రెండు చెవి దిద్దులు మొత్తం కలిపి రెండున్నర తులాల బంగారాన్ని వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు తెలిపారు. వంగర పోలీస్ స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. నిందితులు ఇద్దరు జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో చోరీకి పాల్పడినట్లు వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. 48 గంటల్లో ఈ కేసును ఛేదించిన ఎస్ఐ ఆర్.జనార్ధనరావు, హెచ్‌సిలు కె.టి.రాజు, రామకృష్ణ, సిబ్బంది నర్సింగరావు, దొర, హోంగార్డు గోవిందను సిఐ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐ ఉపేంద్ర రావు

IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE-cum-ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASEE AT: VIZIANAGARAM
O.S. 81/2020

Between:
BANK OF BARODA, Vizianagaram Branch,
Vizianagaram, Rep. by its Branch Manager . . . Plaintiff
And:
Sri P. Suryanarayana Sarma
and another ...Defendants

SUMMONS

To
D-1: Sri P. Suryanarayana Sarma,
S/o. P. Prakasa Rao (Late),
R/at L.I.G. 199, VUDA Colony,
Babametta, Vizianagaram.
D-2: Sri V. Uday Bhaskar Rao,
S/o. V.V. Appala Swamy,
R/at D.No.3-84, Near Water Tank,
Peddapalli Veedhi, Vizianagaram.

Please take notice that the plaintiff herein has filed the above suit on the file of I Addl. Junior Civil Judge Court at Vizianagaram against you for recovery of Loan amount and the same was posted to **22-06-2023** for your appearance. You are hereby directed to appear in the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-06-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
Y.N. RAO, Advocate
Visakhapatnam-43,
Cell: 9247165839.